# కార్యేషుదాసీ. . . .!

'సంసారం సుఖంగా సాగాలంటే, భార్యాభర్తలిరువురూ, ఒకరితో ఒకరు సహకరించాలి! ఒకరిని ఒకరు అర్థం చేసుకోవాలి! ఒకరిని ఒకరు గౌరవించుకోవాలి. అంతేకానీ ఒకరిని ఒకరు అనుమానించుకోవడం, కీచులాడుకోవడం, నిందించుకోవడం, అనర్థానికే దారి తీస్తుంది.

సహజంగా పురుషుడి బాధ్యత సంపాదించుకు రావడం, అతని సంపాదనను సంసారానికి సక్రమంగా వినియోగించి అతనికీ, కుటుంబానికీ కావలసిన సౌకర్యాలు కల్పించడం స్త్రీ బాధ్యతగా పరిగణించబడింది. ఈ రోజుల్లో ఈ విషయంలో మార్పు వచ్చింది. స్త్రీకూడా ఈ రోజున ఉద్యోగం చేసి సంపాదనా పరురాలయింది. దాంతో అటు ఉద్యోగమూ ఇటు ఇల్లూ పిల్లలూ ఉభయ బాధ్యతలనూ స్వీకరించి సతమతమయిపోతోంది. అందుకు పురుషుడు కొంత ఆమెకి చేదోడు వాదోడుగా ఉండాలి!

ప్రకృతి కొన్ని కొన్ని శక్తుల్ని భిన్నభిన్నంగా స్త్రీపురుషులకి అందించింది! కండబలం మగవాడి సొత్తు! అతని శారీరక బలంముందు, ఎంతటి ఘటికురాలైనా ఆడది ఓడిపోక తప్పదు.

అలాగే ఆడవాళ్లకి మనోబలాన్నీ, అంటే సహనాన్నీ ఓర్పునూ ప్రసాదించింది ప్రకృతి. అందుకే సహనంగా నవమాసాలూ ఎంత కష్టాన్నయినా ఓర్చి బిడ్డని మొయ్యగలుగుతోంది, ప్రాణ సంకటమయిన ప్రసూతి బాధని ఆనందంతో భరించగలుగుతోంది! ఈ విధులు ఈ శక్తులు ఎవరివి వారివే! కావాలనుకున్నా మొగాడు పిల్లల్ని కనలేడు, ఆడది మగాడి శారీరక బలం ముందు ఆగలేదు.

అంత కష్టపడిమోసి, కనీ పెంచిన బిడ్డని, తన స్తన్యమిచ్చి పెంచే తల్లి, బిడ్డను తన పొత్తిళ్లలో పట్టుకుని గుండెలకు హత్తుకుని వెచ్చదనాన్నివ్వడమే కాకుండా, తన బలంలో సగాన్ని బిడ్డకి స్తన్యం ద్వారా పంచుతున్నప్పుడు బిడ్డ సంరక్షణం ఆమెకన్న బాగా ఎవరికి తెలుస్తుంది. అందుకే తల్లికి ప్రథమస్థానాన్నిచ్చారు

పెద్దలు ముందుగా 'మాతృదేవోభవ!' అని, ఆ తరువాతే 'పితృదేవోభవ' అనిపించి!

అనారోగ్య స్థితిలోనో, అర్భక పరిస్థితిలోనో భార్య భార్యగా తల్లిగా తన కర్తవ్యాన్ని నిర్వహించ లేకపోవచ్చు. అదివేరు! అప్పుడు భర్త భార్యకీ బిడ్డకీ తనే సేవ చేసే పరిస్థితి ఏర్పడొచ్చు!

అలాగే భర్త నిస్సహాయుడై వుంటే అతనికి చేయూతనివ్వడానికీ, సంసారానికి కావలసినవి అమర్చడానికీ, భార్య ఉద్యోగం చేసి పోషించనూ వచ్చు! ఈ రెండు పరిస్థితులూ, వారి వారి అవసరాలనుబట్టి వుంటాయి, అవి మనం ఇప్పుడు మాట్లాడుకోనక్కర్లేదు. అయితే మామూలుగా ఒక స్త్రీ, ఒక పురుషుడూ, భార్యా భర్తలైనప్పుడు వారి వారి విధులు వారు సక్రమంగా చేసుకుంటూ పోవాలి! ఒకరు ఎక్కువా, ఒకరు తక్కువా అనే భావన రాకూడదు. అయితే 'కార్యేషుదాసీ' అని ఎందుకన్నారూ?' అని కదూ రాశావు! చెబుతా విను!

తను చేసే పనిమీద తనకి న్యూనతా భావం కాకుండా గౌరవం వుండాలి! భక్తి శ్రద్ధలుండాలి! ఒక యజమానిపైన సేవకుడికుండే భక్తీ గౌరవం, ఆరాధన లాగా! అప్పుడే తన విధి నిర్వహణలో క్రమం తప్పడంగానీ, పొరపాట్లు చెయ్యడంగానీ జరగదు! అందుకే మనస్సుని ఇతరత్రా దృష్టి మరలకుండా అదుపులో పెట్టుకుని, తనుచేసే పనిమీద గౌరవంతో విధినిర్వహణలో దాసీలాగా, భర్తకి తోడ్పడితే అతనుకూడా ఏ చిరాకూ, పరాకూ కొరతలూ లేకుండా హాయిగా వుండి తన సమయాన్నీ, సామర్థ్యాన్నీ కుటుంబ పోషణకు వెచ్చిస్తాడు. అతనిని సక్రమంగా తమ పోషణ భారాన్ని వహించడానికి అనువుగా తమవైపు మళ్ళించుకోవాలంటే ఆ కార్య నిర్వహణలో చిత్తశుద్ధితో ఆడది దాసీలాగే తన బాధ్యతలు నిర్వహించాలి.

ఉత్తరం రాయడం పూర్తిచేసి, కవరులో పెట్టి చేతిలో పట్టుకుని చూసింది ఎంత బరువుగా వుందో, ఎన్ని స్టాంపులు పెట్టాలో చూస్తూ చంద్రమతి!

"నీ గుండెల్లోని బరువు తగ్గిందిగా, నీ ముద్దుల కూతురికి కర్తవ్య బోధనచేసి! కవరు బరువు నే చూసుకుంటాలే ఇటివ్వు. నేను పోస్టు చేస్తాను" అంటూ చంద్రమతి మృదులకి రాసిన ఉత్తరాన్ని అందుకున్నాడు, శ్రీపతిరావు. ★